శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున శాంతి భద్రతల పరిరక్షణకు అంతా సహకరించాలని ఎస్ఐ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తాసిల్దార్ వెంకట రామయ్య కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు శాంతి సమావేశం నిర్వహించారు. మండలంలో శాంతి భద్రతలు పరిరక్షణ కొరకు జూన్ 4వ తేదీన జరిగే ఎలక్షన్ కౌంటింగ్ ముందుగాని తర్వాత గాని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చర్చించారు. ఫలితాలకు ముందు, వెలువడిన అనంతరం, మందుగుండు సామాగ్రి కలిగి ఉండి కవ్వింపు చర్యలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం నిష్పక్షపాతంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు శాంతిభద్రతలను కాపాడుటకు సహాయ సహకారములు అందించాలని అధికారులు సమావేశంలో కోరారు. భారీ ర్యాలీలు, బాణసంచా కాల్చడం, వాటర్ బాటిల్లో పెట్రోలు కొనుగోలు చేయడం, అల్లర్లు సృష్టించడం లాంటివి చేయరాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ గెడ్డం సుధారాణి మరియు ఆత్రేయపురం మండలానికి సంబంధించిన వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

17వ

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

బరితెగించిన అక్రమం

- కెఎంసిలో జోరుగా అక్రమ నిర్మాణాలు
- ప్లాన్ లేకుండా నిబంధనలు అతిక్రమించి రేకుల షెడ్లలో రెస్టారెంట్ నిర్మాణం
- లీలా డెంటల్ అక్రమపై అంతస్థులు
- ప్రజాప్రతినిధుల అండతో కట్టడాలు
- అధికారుల మౌనంపై విమర్శలు
- 14 శాతం ప్రభుత్వాదాయానికి గండి
- మార్టిగేజ్ ఉన్నా బరితెగించిన అక్రమం

చీడీలపోరలో 100 అడుగుల రోడ్డుకు ఆనుకొని అక్రమ నిర్మాణం

కాకినాడ జిల్లా కేంద్రంలో జోరుగా అక్రమ నిర్మాణాలు... చీడీలపోరలో ప్లాన్ లేకుండా 600 గజాలలో అతిపెద్ద షెడ్లతో అక్రమంగా రెస్టారెంట్ చక చకా నిర్మాణం.. మరోవైపు ఆర్.ఎం.సి. గ్రౌండ్ రోడ్డులో లీలా డెంటల్ పేరుతో మార్టిగేజ్ ఉన్నా బరితెగించి అక్రమంగా పై అంతస్థులు , సెట్ బ్యాక్స్ వదలకుండా నిర్మిస్తున్నా అధికారుల మౌనంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయల ప్రభుత్వాదాయానికి గండి పడుతోంది. మరోవైపు లక్షలాది రూపాయలు చేతులు మారడం.. ప్రజాప్రతినిధుల అండదండలతో ఈ అక్రమం గుట్టుగా సాగుతున్నట్లు సమాచారం.. కాకినాడ జిల్లా కేంద్రంలో జోరుగా సాగుతున్న అక్రమ కట్టడాలపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో క్షేత్రస్థాయిలో అందించిన పరిశీలనాత్మక కథనం..

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

బరితెగించి జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణాల వెనుక భారీ ఎత్తున ముడుపులు చేతులు మారుతున్నాయి. దోచుకో.. దాచుకో విధానంతో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి..కాకినాడ జిల్లా కేంద్రం కె.ఎం.సి. పరిధిలోని చీడీలపోర వంద అడుగుల రోడ్డుకు ఆనుకొని 600 గజాలకు పైగా నాన్ లేఅవుట్ స్థలంలో ఎటువంటి నిర్మాణ అనుమతులు తీసుకోకుండా, కనీసం ఒక్క రూపాయి ఫీజులు క్రింద చలించకుండా కె.ఎం.సి.కి ఆదాయంగా రావాల్సిన 14 శాతం ఫీజులు ఎగ్గొట్టి ... ప్రభుత్వ ఆదాయం లక్షలాది రూపాయలకు గండి కొట్టేలా జరుగుతున్న అతిపెద్ద రెస్టారెంట్ నిర్మాణం వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు చెబుతున్నారు. కె.ఎం.సి. ఇంజనీరింగ్ బాస్ ఆదేశాలతోఈ వ్యవహారం నడుస్తున్నట్లు ప్రచారంలో వుంది.

కె.ఎం.సి.కి ఈ అక్రమ నిర్మాణం వల్ల సుమారు 20 లక్షలకు పైగా ఆదాయం గండి పడిందని తెలుస్తోంది. అంతేకాక ఆ స్థలానికి తూర్పువైపు మూడు అడుగుల దారి మార్గం మాత్రమే వుందని, అటువంటిది పడమర వైపు ప్రభుత్వ పోరంబోకు స్థలం ఆక్రమించి పెద్దయెత్తున నిర్మిస్తున్నా పట్టించుకోకపోవడం, అధికారులు మౌనంగా ఉండటం దేనికి సంకేతం అంటున్నారు. అలాగే ఆర్.ఎం.సి. రోడ్డులో లీలా డెంటల్ పేరుతో అతి భారీ భవంతి నిర్మాణం జరిగింది. ఈ భవంతికి బరితెగించి నాలుగో అంతస్థు అక్రమంగా నిర్మించినట్లు చెబుతున్నారు. మార్టిగేజ్ ఉన్నా ఈ రకంగా అక్రమానికి బరితెగించారంటే వీరి వెనుక పెద్దయెత్తున ఆర్థిక బలం, రాజకీయ బలం ఉన్నట్లుగా ఉండటంతో అధికారులు అటువైపు చూడడం లేదని విమర్శలు ఉన్నాయి. వెనుకవైపు సెట్ బ్యాక్స్‌లో మెట్లు ఏర్పాటు చేసారని,

- తరువాయి 2లో..

ఎం.మణికుమారికి జెఎన్టీయుకె పిహెచ్‌డి

కాకినాడ, మేజర్ న్యూస్ : నిపుణుల బృందంసిఫార్సు మేరకు ఎం.మణి కుమారి సిద్ధాంత వ్యాసం "రిడక్షన్ ఆఫ్ డిలే అండ్ పవర్ ఇన్ విఎల్ఎస్ఐ ఇంటర్‌కనెక్ట్స్ యూజింగ్ మల్టిపుల్ వాల్యూడ్ లాజిక్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈమెకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగంలో లభించినది. ఎం.మణికుమారి తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ గ్రీన్ ఇనీషియేటివ్స్ డైరెక్టర్ డా. కె.పద్మప్రియ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

వరదలా ముంచెత్తిన అకాల వర్షం

- పూడిక ముంపుతో కార్పోరేషన్ నిర్లక్ష్యంతో తల్లడిల్లిన స్మార్ట్ సిటీ
- ముంపు నివారణకు జిల్లా యంత్రాంగంయాక్షన్ ప్లాన్ అమలు చేయాలి
- పౌర సంఘం డిమాండ్

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ నగరం శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి క్లాస్ మాస్ ఏరియా తేడాలేకుండా స్మార్ట్ సిటీ సర్వం పూడిక ముంపు జలాలతో తల్లడిల్లింది. కార్పోరేషన్ వేసవి ఎండల ప్రారంభంలో చేయాల్సిన పూడిక తొలగింపు తరలింపు పనులను మే నెలాఖరులో చేపట్టడం వలన లక్షలాది రూపాయల నిధులు మురుగు పాలయ్యాయి. వీధి కాలువల్లో తీసిన ఎక్కడి పూడిక అక్కడే ఉండిపోయింది. వ్యర్థాల తరలింపు జరగలేదు. ప్రధాన రహదారుల్లో ఆర్ అండ్ బి క్రాస్ కల్వర్టుల దిగువ క్లీనింగ్ జరగలేదు. అవుట్ లెట్స్ క్లియరెన్స్ నిర్వహించ లేదు. రేచర్లపేట రైల్వే డ్రైన్ పిడబ్ల్యూడి కాలువ చీడీలపోర మేజర్ డ్రైన్స్ సినిమా రోడ్ కవర్ స్లాబ్ డ్రెయిన్లు ఉప్పుటేరు కాలువ ప్రవాహాల అడ్డగింపు ప్రక్షాళన చేపట్టలేదు. కార్పోరేషన్ ఆర్థికమాంద్యంతో పౌర సౌకర్యాల ముందస్తు ప్రణాళికలు స్తంభించి పోయాయి. ఒక పక్క వీధి దీపాల నిర్వహణ తూతూ మంత్రంగా తయారయ్యింది. మరోప్రక్క మురుగు కాలువల్లో పూడికతీత అరుంధతీ నక్షత్రంగా మారింది. వేసవి ముందస్తు రిపేర్లు చేయక కుళాయిల్లో త్రాగునీరు సరఫరా నిలిచిపోయింది. ట్యాంకర్ల ద్వారా అందించే ఏర్పాటు సన్నగిల్లింది. జరాసంధుడి శరీరాన్ని చీల్చి పారేసినట్టుగా సినిమారోడ్డు లోని కార్పోరేషన్ ఉన్నతాధికారుల కార్యాలయం నిర్వహణ నలువైపులకు చెదిరిపోయింది. కో ఆర్డినేషన్ కొరవడింది. రెవిన్యూ పిడబ్ల్యూడి నీటిపారు దల మున్సిపాలిటీ ఆర్ అండ్ బి మున్నగు ప్రభుత్వ శాఖల నడుమ సమన్వయం లేక జిల్లా కేంద్రం మురుగు ముంపుకు వర్షం బెడదకు కునారిల్లు తోంది. అడ్డు అదుపు లేకుండా సిమెంటు రోడ్లు ఎత్తు చేయడం వలన గ్రుహాల లోగిళ్ళు లోతట్టుగా మారి కురుగుతో జల దిగ్బం దనమయ్యాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం ప్రభుత్వం కళ్లు తెరవాలని కాకినాడ ముంపు బెడద నివారణకు యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ప్రముఖ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం ముంపుకు గురైన ప్రాంతాలను సందర్శించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

ఎస్.తిరుమలదేవికి జెఎన్టీయుకె పిహెచ్‌డి

కాకినాడ, మేజర్ న్యూస్ : నిపుణుల బృందంసిఫార్సు మేరకు ఎస్.తిరు మలదేవి సిద్ధాంత వ్యాసం "సీన్ క్లాసిఫికేషన్ యూజింగ్ పీచర్ ఫ్యూజన్ ఆఫ్ ప్రీ ట్రైన్డ్ సిఎన్ఎన్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈమెకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగంలో లభించినది. శ్రీమతి ఎస్.తిరుమలదేవి తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ఈసిఈ విభాగం ప్రొఫెసర్ డా. ఎం.శైలజ మరియు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని వాసవీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈసిఈ విభాగం ప్రొఫెసర్ డా. కె.వీరాస్వామి ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం,మేజర్న్యూస్: కోనసీమతిరుమలవాడపల్లి వెంకటేశ్వర స్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి వేమగిరికి చెందిన గుర్రం భూపతిరావు,రత్నందంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.50,116లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సిబ్బంది స్వామి వారి చిత్రపటాన్ని అందించారు.

జూన్ 15 లోపు డి- సిల్టేషన్ పూర్తి

- ముంపు సమస్య రాకుండా ప్రణాళిక
- పారిశుద్ధ్యం పైనా ప్రత్యేక దృష్టి
- కమిషనర్ జే.వెంకటరావు వెల్లడి

కాకినాడ, మేజర్ న్యూస్ : జూన్ 15వ తేదీ లోపుగా డి- సిల్టేషన్ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు అధికారులను ఆదేశించారు. వర్షాలు పడే లోపుగా పూడికతీత పనులు పూర్తి చేసి నగరంలో ఎక్కడా వర్షపు నిలిచిపోకుండా చూడాలని సూచించారు. శుక్రవారం ఆయన ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్,శానిటరీ ఇన్స్పెక్టర్ లతో కలిసి నగరంలో జరుగుతున్న పూడిక తీత పనులను పర్యవేక్షించారు. సుబ్బయ్య హోటల్, రామారావుపేట,పెద్ద మార్కెట్, పాత బిఎస్ఎన్ఎల్ కార్యాలయం, వార్ఫ్ రోడ్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పారిశుద్ధ్య పనులను కూడా పర్యవేక్షించారు. డీ-సిల్టేషన్ పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. 14 శానిటరీ సర్కిల్స్ పరిధిలో ఇప్పటికే నాలుగు సర్కిల్స్‌లో పూడికతీత పనులు పూర్తయ్యాయని, మిగిలినచోట్ల వివిధ దశల్లో ఉన్నాయని ఎంహెచ్ఓ డాక్టర్ పృద్వి చరణ్ కమిషనర్‌కు వివరించారు. ప్రధానమైన రైల్వే డ్రైన్,పెద్ద మార్కెట్ నుంచి వెళ్లే ప్రధాన డ్రైనేజీలపై దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. అవుట్‌లెట్లను కూడా కమిషనర్ పరిశీలించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కూడా కమిషనర్ పర్యవేక్షించారు. తడి-పొడి చెత్త సేకరణ, ఇంటింటికి చెత్త సేకరణ జరుగుతున్న తీరును పరిశీలించారు. మార్కెట్ ప్రాంతాలలో నైట్ శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల విషయంలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం ఉపేక్షించేది లేదని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలని సూచించారు. అదే సమయంలో ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించినప్పుడే కాకినాడ నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్ద గలమన్నారు. ఆయన వెంట శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్లు ఉన్నారు.

పేద వర్గాల మహిళలకు ఉచిత న్యాయ సహాయం

- రంపచోడవరంలో న్యాయ విజ్ఞాన సదస్సు

రంపచోడవరం,మేజర్న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలోని పేద బడుగు బలహీన వర్గాల మహిళలకు ఉచిత న్యాయ సహాయం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించడం జరుగుతుందని రంపచోడవరం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ పి.బాబు పేర్కొన్నారు. రంపచోడవరంఐటీడీఏసమావేశంహాలులో న్యాయవాదులు, ఐసిడిఎస్ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, గ్రామ సచివాలయాలకు సంబంధించిన మహిళా పోలీసులు, మహిళా సంఘాల సభ్యులుతో ఉచిత న్యాయ సహాయం కొరకు మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ పి.బాబు ముఖ్యఅతిథిగా హాజరై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ, జిల్లా లీగల్ సెల్ అథారిటీ, మండల స్థాయి లీగల్ సెల్ అథారిటీ ద్వారా పేద బడుగు బలహీనవర్గాలమహిళలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ (రాజమహేంద్రవరం) గంధం సునీత ఆదేశాలు మేరకు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి న్యూ మాడువల్ క్యాంప్ లో భాగంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, చైర్మన్ బాబు మాట్లాడుతూ కొంతమందిమహిళలు పొట్టకూటి కోసం వ్యభిచార వృత్తి నిర్వహిస్తున్నారని, అటువంటివ్యభిచార వృత్తి మానివేసే విధంగా మనవంతుగాఅవగాహనకల్పించాలన్నారు.మహిళలనుఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేసే వారిని గుర్తించి బాధితులను రక్షించే విధంగా ఐసిడిఎస్ ద్వారా చట్టం ద్వారా రక్షించవచ్చని ఆయన తెలిపారు. చిన్నపిల్లలను ఎవరైనా అక్రమ రవాణా చేస్తే అటువంటి వారిని గుర్తించి స్కూల్స్‌లో జాయిన్ చేసే విధంగా చట్టాలు ఉన్నాయన్నారు. రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఓటర్ కార్డ్ లేనివారిని గుర్తించి అటువంటి వారి దగ్గర నుండి దరఖాస్తులు వస్తే లీగల్ సెల్ ద్వారా పరిశీలించి న్యాయం చేయవచ్చని ఆయన తెలిపారు. ఆథరైజ్డ్ సెక్టార్, అనాథరైజెడ్ సెక్టార్లగురించి వివరిస్తూ సెక్టార్లు ఏ విధంగా పనిచేస్తాయో చైర్మన్ వివరించడం జరిగింది.చదువుకోలేనిపిల్లలు చదువుకునే విధంగా తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. దేశంలో 75 పార్లమెంటు నియోజకవర్గాలు పరిధిలో సుమారు 10 కోట్ల 50 లక్షల మంది వివిధ గిరిజన జాతులవారు ఉన్నారని ఆయన తెలిపారు. కొండపోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు ఫారెస్ట్ యాక్ట్ నిబంధనలు ఉన్నాయని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీసా చట్టం ద్వారా ఆయా గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకు తీర్మానాలు చేయవచ్చని ఆయన తెలిపారు. ప్రస్తుతం 18 సంవత్సరాల నుండి 22 సంవత్సరాల మధ్య వయసువారు కూలి కోసం గంజాయి తరలిస్తున్నారని ,అటువంటివారుగంజాయితరలించకుండా మాని వేయాలనిఅవగాహన కల్పించాలన్నారు.అదేవిధంగాపిల్లల తల్లిదండ్రులు, పిల్లలు ఏంచేస్తున్నారో ఎప్పటికప్పుడు అబ్జర్వేషన్ చేస్తూ ఉండాలన్నారు. అదేవిధంగాచెడువ్యసనాలకుబానినకాకుండా తల్లిదండ్రులు ముందుగా జాగ్రత్త పడాలన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా పారా లీగల్ వాలంటీర్ల కోసం, లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా విపత్తుల సంభవించినప్పుడు న్యాయ సేవ కోసం, ట్రాఫిక్ కమర్షియల్ ద్వారా లైంగికదోపిడీ బాధితులకు న్యాయం కోసం, అసంఘటిత రంగాలలోని కార్మికులకు న్యాయ సేవలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నెల్స ద్వారా పిల్లలకు, పిల్లల స్నేహపూరిక న్యాయ సేవల ద్వారా రక్షణ కలిగించుట, మానసిక అనారోగ్యంమానసికవికలాంగులకు చట్టపర మైన సేవలుఅందించుట,పేదరికనిర్మూలనపథకాల ప్రభావంతమైన పథకాలు అమలు చేయుట గురించి,ఆదివాసీహక్కులు పథకాలు అమలు చేయుటగురించి,మాదకద్రవ్యాలదుర్వినియోగం, మాదక ద్రవ్యాల నిర్మూలన బాధితులకు చట్టపరమైన సేవలు గురించి, వృద్ధులకు చట్టపరమైనసేవలందించడం, యాసిడ్ దాడుల బాధితులకు న్యాయ సేవలు అందించడం, వికలాంగుల పిల్లల కోసం చట్టపరమైన సేవలు, లైంగిక వేధింపులు, ఇతర నేరాల బాధితుల ప్రాణాలతో బయటపడినవారికి నేషనల్ లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం చేయడం జరుగుతుందని మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ పేర్కొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో జనరల్ సి.హెచ్. శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోనే మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా వివిధ రకాలైన చట్టాలపై పూర్తిగా అవగాహన చేసుకుని తెలియని వారికి అవగాహన కల్పించాలని ఆయన కోరారు. రంపచోడవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ వాసా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో చాలామంది మహిళలకు మండల లీగల్ సెల్ అథారిటీ ఉందని తెలియదని, దీని గురించి ప్రతీ గ్రామంలోని మహిళలకు అవగాహన కల్పించే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రతీ పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాలు ఉన్నాయని, అదేవిధంగా ఎటువంటి తప్పులు చేయడానికి ఆస్కారం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మహిళలకు రక్షణగా పోలీస్ శాఖ పనిచేస్తుందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. అబు సలాం, వెలుగు అధికారులు, న్యాయవాదులు ఎం.వి.ఆర్ ప్రకాష్, సత్య ప్రసాద్, టివెంకట్రావు,చుక్కసంతోష్‌కుమార్, జిలానీ, చైతన్య, భగవాన్, వెంకటేశ్వరరావు, సిడిపివోలుసంధ్యారాణి, ప్రసన్నలక్ష్మి, లక్ష్మి, తాసిల్దార్ చలపతిరావు, ఎంపీడీవో హరికృష్ణ,సర్కిల్ఇన్‌స్పెక్టర్ కె.వి.కృష్ణకుమార్, గ్రామ సచివాలయాల మహిళ పోలీసులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన

పెద్దాపురం,మేజర్న్యూస్: పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ మోహనరావు ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఎన్.వి.శేఖర్, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు,క్రాంతివీర్,లోవ,శివ తదితరులు పాల్గొన్నారు.

జంతువుల పట్ల దయతో మెలగాలి

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో స్థానిక వరహాలయ్యపేటలో యాసలపు సూర్యారావు భవనంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్ గురువారానికి 14వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో జంతు ప్రేమికులు నవీనన, నాని జంతువుల పట్ల మనం ఎలా వ్యవహరించాలో, పెంపుడు జంతువులు పావురం, కోడి, బాతులు, చేపలు, కుక్కలు, వివిధ రకాల జంతువులను తీసుకువచ్చి, విద్యార్థులకు వివరించారు. అలాగే జంతువులు తమను తాము కాపాడుకోవడం కోసం అవి చేసే ప్రయత్నాలను, వాటి పిల్లలకు తిండి పెట్టే విధానాన్ని, వాటి నివాసం, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్,మంజుల,అమృత,సాయి,బంగారం, మణికంఠ, నేహ, రేణుక, శ్రీజ, రవి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

అన్నార్తులకు ఆశ్రయం

- దిక్కు లేనివారికి కొండంత అండ.. జీవకారుణ్యం

కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి : ఏ దిక్కు లేనివారికి దేవుడే దిక్కు అంటారు. అది వాస్తవం అని నిరూపిస్తోంది ఆ సంస్థ. అనాధలు, దివ్యాంగులు, కుష్టు రోగులు, పిల్లలు ఉండీ తల్లిదండ్రులను భారంగా భావించి వదిలేసిన వారందరికీ ఆ సంస్థ పెద్దదిక్కు. వారందరినీ అక్కున చేర్చుకుంటోంది రాజమహేంద్రవరంలోని గౌతమి జీవ కారుణ్య సంఘం.వేదంలా ఘోషించే గోదావరి .. అమరదామం లా విరాజిల్లే రాజమహేంద్రి.అలాంటిచారిత్రాత్మకనగరంలోఎందరో మహానుభావులు. కందుకూరి వీరేశలింగం..ఇక్కడే సమాజసేవకు అంకితమయ్యారు. అదే కోవకు వస్తుంది ఈజీవకారుణ్య సంఘం.కారుణ్యానంద స్వామీజీ 1940కు ముందు భిక్షాటన చేసి వచ్చిన డబ్బులతో గౌతమి జీవ కారుణ్య సంఘం ఏర్పాటు చేశారు. అనాధలు, వృద్ధులు, దివ్యాంగులకు ఆశ్రయం కల్పించడం, భోజనాలు పెట్టడం, అనాధ ప్రేత సంస్కారం చేయడం వంటి కార్యక్రమాలునిర్వహించేవారు. అప్పట్లో తాను భిక్షాటన చేసిన సొమ్ముతో స్థలాలు కొన్నారు.ఈసంస్థఏర్పాటుచేశారు. అనంతరం ఇది దేవదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. సుమారుగా 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నఈజీవకారుణ్యసంఘంలో80 మంది పైగా నిరాశ్రయులు ఉన్నారు. అందులో నలుగురు కుష్టు రోగులు ఉన్నారు. మిగిలిన వారు వృద్ధులు, ఒంటరి మహిళలు, పిల్లలు భారంగా భావించి వదిలేసిన తల్లిదండ్రులు. వారందరికీ ప్రతిరోజుఉదయంయోగా నేర్పిస్తారు. అనంతరం అల్పాహారం, వేడి వేడిగా టీ కాఫీ ఇస్తారు. కాలక్షేపం కోసం టీవీలు ఏర్పాటు చేశారు.సోలార్విద్యుత్ అదనంగా వానాకాలం సోలార్ సమస్య రాకుండా ఇన్వర్టర్లు.వారంతా తాము అనాధలం లేదా దిక్కులేని వారం అన్న భావన లేకుండా టీవీ సీరియల్ చూస్తూ వారిలో వారు చర్చలు కూడా జరుపుకొంటారు. మధ్యాహ్న ఒంటిగంటకు భోజనం. అనంతరం అందరూ చిన్న పిల్లల్లా నిద్రపోతారు. సాయంత్రం నాలుగు గంటలకు చాయ్ బిస్కెట్. రాత్రి ఏడు గంటలకు భోజనం, 10 వరకు టీవీ చూడడం, హాయిగా పడుకోవడం. ఎలాంటి బాధరబంధీ లేదు. ఇక్కడే బాధపడే అంశం ఒకటే. వీరులో వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ప్రతీ నెల వై.ఎస్.ఆర్. ఫించను కానుక కింద ఫించన్ వస్తుంది. కానీ ఆ పింఛన్ సొమ్ములు వారి పిల్లలు లేదా బంధువులు వచ్చి వాటిని తీసుకువెళ్లిపోతున్నారు.దేవాదాయశాఖవారినుంచి డబ్బులు తీసుకోదు. అన్నీ ఉచితమే. పైగా ప్రతిరోజు ఓ వైద్యుడు. వీరందరిని పరీక్షిస్తాడు.అవసరమైన మందులు ఉచితంగా ఇస్తారు. ఇంగ్లీష్ మందులు పడవు అనేవారికి హోమియో లేదా ఆయుర్వేద మందులు ఇస్తారు. సంస్థ కార్య నిర్వహణ అధికారి విళ్ల పల్లంరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఒక సేవ భాగంగా పనిచేస్తున్నారు తప్ప ఇది తాము తీసుకుంటున్న జీతానికి చేస్తున్న పని అనుకోరు. అదేవిధంగా అత్యవసర రోగుల కోసం ఐసీయూ కూడా ఉంది. మరణానికి దగ్గరగా ఉన్నవారి కోసం మరో వార్డు ఉంది. వారు మృతి చెందితే వారి బంధువులకు సమాచారం అందజేస్తారు. వారు మరణిస్తే వస్తే వారు వస్తారు. లేదా దహన సంస్కారం కూడా వీరే చేస్తారు. మానవసేవే మాధవసేవ, అనాధసేవే నారాయణ సేవ అని భావించి ఇక్కడ పనిచేస్తున్నామని అసిస్టెంట్ కమిషనర్ పల్లంరాజు వెల్లడించారు.

ప్రస్తుతం 80 మంది ఉన్నారు. అదేవిధంగా ఎవరూ లేరు అన్న భావన కలుగవద్దు. తామంతా వారికి అండగా ఉన్నాము. తమ శాఖ అండగా ఉంది అంటారు. ఈ సంస్థకు 90 ఎకరాల పొలాలు ఉన్నాయి. వాటిపై శిస్తు వస్తుంది. అలాగేదాతలుసహకరిస్తారు. రాజమహేంద్రవరంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన దాతలు కూడా వీరి మధ్యకు వచ్చి కాలక్షేపం చేస్తారు. వారితో కలిసి మెలిసి ఆడుకుంటారు. ఫ్యామిలీ డాక్టర్ అంటూ ప్రతిరోజూ ఇక్కడ ఉన్న వారందరికీ వైద్య సేవలు అందజేస్తున్న ఈవో సిబ్బందిని ప్రతి ఒక్కరు అభినందించాల్సిందే.

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు.

-ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా సరే ఉపేక్షించేది లేదు.
-ముందస్తు భద్రత ఏర్పాట్లపై జిల్లా పోలీసు అధికారులతో ఎస్పి పి జగదీష్ సమీక్ష
-సభలకు సమావేశాలకు గాని ఎటువంటి అనుమతులు లేవు
-తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీష్

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఎడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు సబ్ ఇన్స్పెక్టర్ల తో కౌంటింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన ముందస్తు భద్రత ఏర్పాట్ల గురించి మరియు ప్లాన్ ఆఫ్ యాక్షన్ గురించి జిల్లా ఎస్పీ పి జగదీష్ చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి జగదీష్ మాట్లాడుతూ...ఎన్నికల కౌంటింగు కేంద్రాల వద్ద ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, చేపట్టాల్సిన భద్రత చర్యల పట్ల అధికారులకు అవగాహన కల్పించి, దిశానిర్దేశం చేయడం జరిగిందన్నారు. కౌంటింగు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రత, రూఫ్ టాప్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ రెగ్యులేషన్, వాహనాల పార్కింగుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. కౌంటింగు కేంద్రాల వద్ద ప్రజలు గుమిగూడకుండా చూడాలన్నారు. కౌంటింగు కేంద్రాలకు విచ్చేసే వివిధ పార్టీలకు చెందిన కౌంటింగు ఏజంట్లు వాహనాలను కౌంటింగు కేంద్రాల వద్ద ప్రత్యేకంగా నిర్దేశించిన పార్కింగు ప్రాంతాలకు తరలించాలన్నారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని, కాషనరీ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగు కేంద్రాలలోకి వెళ్ళే కౌంటింగు ఏజంట్లును కుణ్ణంగా తనిఖీ చేయాలని, రిటర్నింగు అధికారి జారీ చేసిన అనుమతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత మాత్రమే కౌంటింగు కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. కౌంటింగు కేంద్రాల పరిసరాలను బాంబ్ డిస్పోజల్స్ బృందాలతో తనిఖీలు చేయాలని, మహిళలను తనిఖీ చేసేందుకు ప్రత్యేకంగా మహిళా పోలీసు సిబ్బందిని నియమించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఫలితాలు వెల్లడైన తరువాత ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ముందస్తుచర్యలు చేపట్టాలని, పెట్రోలింగు నిర్వహించాలని, ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో నిఘా పెట్టాలని అధికారులను జిల్లాఎస్పీ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) పి.అనిల్ కుమార్,అడిషనల్ ఎస్పీ(ఎడ్మిన్) ఎస్. ఆర్. రాజశేఖర్ రాజు,అడిషనల్ ఎస్పీ(ఏ.ఆర్)ఎల్. చెంచిరెడ్డి,జోనల్ డిఎస్పీలు,ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

వరుపుల సత్య ప్రభ పుట్టినరోజున అనాధలకు దుప్పట్లు పంపిణీ

రౌతులపూడి,మేజర్న్యూస్ : ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ అభ్యర్థి వరుపుల సత్య ప్రభ రాజా పుట్టినరోజు సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గం టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు గవిరెడ్డి గురునాథ్ అనాధలకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ వరుపుల రాజా కుటుంబం సేవా కార్యక్రమంలో ముందుంటుందని ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు తెలుసు అన్నారు.ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజాభిమాన నాయకురాలు సత్యప్రభ పుట్టినరోజున అన్నవరం వచ్చి అనాధలకు పేదలకు రొట్లు,పండ్లు,దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది అన్నారు.అనాధలు అభాగ్యులు పట్ల మానవత్వ దృక్పథం చూపడం మానవ పుట్టుకకు అర్థం అన్నారు.రాజకీయంగానే కాకుండా ప్రజా సమస్యలు,అనాధలకు, ఆపదలో ఉన్న తోటి వారికి సహాయం అందించడం,స్వర్గీయ వరుకుల రాజా సూచించిన సిద్ధాంతాలు అన్నారు. నియోజకవర్గ తెలుగుదేశం అభిమానులు కార్యకర్తలు స్వర్గీయ రాజా ఆశయాలను సిద్ధాంతాలను పాటిస్తున్నారని ఆయన తెలిపారు.ఆయన చేసిన సేవలే ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి బలం అన్నారు.మన చుట్టూ ఉన్నవారు బాగుంటేనే మనం బాగుంటాం అను సిద్ధాంతం నమ్మిన వంశముగా మాకు పేరుంది అన్నారు.అతి చిన్న వయసులోనే గవిరెడ్డి గురునాద్ సేవలు అనేక గ్రామాల్లో వర్ధిల్లుతున్నాయి. తనను నమ్ముకుని వచ్చిన అనేక గ్రామాల ప్రజలకు తనకు తోచిన సహాయం చేస్తూ ఆసరాగా ఉంటారని పేరు ఉంది.ఈ కుర్రవాడు గురునాథం వల్లే ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకు సాగాలని పేదలు,అనాధలు సంతోషం వ్యక్తం చేశారు.

ఆదిత్యలో ఉత్సహంగా ముగిసిన క్రీడా పోటీలు

గండేపల్లి, మేజర్ న్యూస్ : ఆదిత్య విద్యా ప్రాంగణంలో గత మూడు వారాలుగా వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన క్రికెట్ మరియు ఫుట్ బాల్ పోటీలు స్నేహపూర్వక వాతావరణంలో ఉత్సాహంగా సాగాయి. ఎ.పి.ఎల్ పేరిట నిర్వహించిన క్రికెట్ పోటీలలో 11 టీమ్‌లు తలపడగా ఫైనల్ పోటీల లో తలపడిన సూపర్ జైంట్ జట్టు సూపర్ క్యాపిటల్స్ జట్టు మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో సూపర్ జైంట్ జట్టు విజయం సాధించి విజేతగా నిలువగా సూపర్ క్యాపిటల్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఎఎఫ్.ఎల్. ఫుట్ బాల్ పోటీలలో 5 జట్లు పాల్గొనగా ఫైనల్ పోటీ కంజలి ఎఫ్.సి మరియు పల్కన ఎఫ్.సి ల మధ్య జరుగగా కంజలి ఎఫ్.సి విన్నర్ గాను పల్కన ఎఫ్.సి రన్నర్ గాను నిలిచాయి. రెండు విభాగాలలో విజేతలకు విన్నర్ జట్టు కు రూ. 6000/- నగదు రన్నర్ జట్టుకు రూ. 4000/- నగదు తో పాటు ట్రోఫీలు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్స్ లర్ డా. ఎం. శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఆద్యంతం పూర్తి నిష్పక్షపాతంగా అంపైరింగ్ భాద్యతలను ఫీజికల్ డిపార్ట్మెంట్ విభాగం సభ్యులు నిర్వహించిన పోటీలు విజయవంతం కావడంలో సహకరించారు. ఈ సందర్భంగా డా . శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నిర్వహించిన పోటీలు పూర్తి స్థాయి క్రీడా స్ఫూర్తితో ఎంతో రసవత్తరంగా జరిగాయని ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్స్ లర్ అకడమిక్స్ . డా. ఎస్. రమాశ్రీ, రిజిస్ట్రార్ డా. జి.సురేష్, డా. ఎ. రామకృష్ణ,ప్రో. వి. సత్యనారాయణ, ఫీజికల్ డైరెక్టర్స్ విభాగాధిపతి జి.వి. ప్రతాప్ రెడ్డి ఫీజికల్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

ఏపీపీఎస్సి నోటిఫికేషన్ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టుకు జిల్లాలో హాజరు కానున్న అభ్యర్థులు 960 మంది

-జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పకడ్బందీ ఏర్పాట్లు
-పరిపాలనాధికారి బి.వి.ఎస్.రామారావు

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్న డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టుకు జిల్లాలో 960 మంది అభ్యర్థులు శనివారం ఉదయం పరీక్షలకు హాజరు కానున్నారని కలెక్టరేట్ పరిపాలనాధికారి బి.వి.ఎస్ రామారావు తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో సమన్వయ శాఖల అధికారులతో ఎపిపి ఎస్సి పరీక్షల ముందస్తు ఏర్పాట్లపై సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ వో రామారావు మాట్లాడుతూ పరీక్షలు సక్రమంగా నిర్వహించడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయ్యాలని కోరారు. ఈ పరీక్షల కోసం రాజమండ్రిలో రాజీవ్ గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్స్టి ట్యూషన్స్ కళాశాలలో సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఉదయం 9.00 గంటల నుండి ఉదయం 11. 30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగు తుందన్నారు. ఉదయము 7.30 గంటల నుండి ఉదయం 8.15 వరకు పరీక్ష వ్రాసే అభ్యర్థులను అనుమతించడం జరుగు తుందన్నారు. గ్రేస్ పిరియడ్ 15 నిమిషాలు ఉంటుందని, తదుపరి పరీక్ష హాలు లోనికి అభ్యర్థులను అనుమతించడం జరగదనీ, కావున ముందుగా అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు, కాలిక్యు లేటర్లు, ఐప్యాడ్, బ్లూటూత్, పేజర్ లేదా ఇంట్రాక్ట్ ప్రోగ్రామింగ్ చేయగల ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రానికిఅనుమతించడం జరగదన్నారు. పరీక్షా కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్తు ఉండేలా చూసుకోవాలని, వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో మంచినీటి సరఫరా, పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులు ఆదేశించారు.ఈ సందర్భంగా ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్, ఏ.ఎం మాధవీలత మాట్లాడుతూ అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటుగా ఒక ఒరిజినల్ ఫోటో ఐ.డి. (పాస్ పోర్టు, పాన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, ప్రభుత్వ గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు లతో హాజరు కావాలన్నారు. పరీక్షలు వ్రాసే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు పరీక్ష సమయానికి కంటే ఒక గంట ముందు పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని అన్నారు.ఈసమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, కే అనిల్ కుమార్, డిహెచ్ఎంవో, పి. జాన్సన్ రాజు,ఎస్.ఐ.,ఏకలం,ఎపీ ఈపి. డీసీఎల్, డిఈఈ, ఎస్. దేవయ్య, లైజన్ ఆఫీసర్, టి.దివాకర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : సిఐ గణేష్

- అనపర్తిలో మాబ్ డ్రిల్

అనపర్తి,మేజర్ న్యూస్ : శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన, అసంఘిక శక్తులు అలజడి సృష్టించేందుకు ప్రయత్నం చేసిన అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని అనపర్తి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివ గణేష్ అన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను అనపర్తి పంచాయతీ ఆఫీస్ వద్ద మెయిన్ రోడ్డులో శాంతి భద్రతలను విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే అల్లరి మూకలపై పోలీసులు ఏ విధంగా అదుపు చేస్తారో సిఐ శివ గణేష్ ఆధ్వర్యంలో ఎస్సై రామారావు పర్యవేక్షణలో మాబ్ డీల్ నిర్వహించారు. ప్రముఖుల దిష్టిబొమ్మల దగ్ధం,రోడ్లపై ధర్నా, ఆందోళన చేసే వారిపై తొలిత హెచ్చరికలు జారీ చేసి, అదుపుతప్పే క్రమంలో పోలీసులు లాటి చార్జ్ భాష్ప వాయువు ప్రయోగం(టియర్ గ్యాస్), వంటి పోలీసు చర్యలను డ్రిల్ ద్వారా వివరించారు, భాష్ప వాయువు ప్రయోగం ప్రయోగించిన సమయంలో ఒక్కసారిగా పొగలు వ్యాప్తి చెంది, కళ్ళు మంటలు, ఊపిరి ఆడక పోవడం పరిస్థితి ఏర్పడింది. గుమ్ముగూడిన ప్రజలు నాలుగు వైపులకు చెదిరిపోయారు. పోలీసులు మాత్రం అల్లరిమోకలపై చర్యలు చేపట్టిన తీరు ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ శివ గణేష్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా ఎటువంటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పోలీస్ వ్యవస్థ సిద్ధంగా ఉందని, 'మాబ్ ఆపరేషన్' (మాబ్ డ్రిల్)చేపట్టి ప్రజల్లో అవగాహన అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని,చట్టాన్ని అతిక్రమించి అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పుఅనిహెచ్చరించారు, ప్రజలకు పోలీసులు అండగా ఉంటామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

-కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్



పిఠాపురం,మేజర్న్యూస్ : ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కళ్యాణ మండపంలో నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ... జూన్ 4 తేదీ కౌంటింగ్ రోజు కౌంటింగ్ ఏజెంట్, అభ్యర్థి తప్ప వేరే ఎవరు కూడా కౌంటింగ్ కేంద్రాలకు రాకుండా వారి ఇళ్ళ వద్దే ఉండాలన్నారు. ఇప్పటికే కౌంటింగ్ సంబంధించిన అన్ని భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామాల్లో కౌంటింగ్ రోజు ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రజలు సహకరించాలని కోరారు. పలు గ్రామాల్లో ఎస్పైలతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే నెల జూన్6 తేదీ వరకు సెక్షన్ 144, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో ఉంటుందని, ఎవరు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించకుండా పోలీసు వారికి సహకరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ కు సహకరించాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడి సామాన్య ప్రజానీకానికి అసౌకర్యం కలిగించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డిఎస్పి కె హనుమంతరావు, పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,ఎస్ ఐ లు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బరితెగించిన అక్రమం

1పేజి తరువాయి

ముందువైపు సెట్‌బ్యాక్స్ లేవని అంటున్నారు. రహదారులు, ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా, ఎటువంటి అనుమతులు లేకుండా పై అంతస్థులు నిర్మిస్తున్నా మౌనం వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇంకా అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తూ వారికి పూర్తి సహకారం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణదారులు ఇచ్చే ముడుపులకు ఆశపడి ఇలా చేస్తున్నారా ? లేదా మరేమైనా ఒత్తిళ్ళకు లోన్కె ప్రజాప్రతినిధులు ప్రోత్సహిస్తున్నారా ? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటర్ సప్లమెంటరీ ఎగ్జామ్‌కి 58 మంది హాజరు

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన రాజవొమ్మంగి ఏపీ గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షకలకు 58 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కాగా శుక్రవారం నిర్వహించిన పేపర్ వన్, పేపర్-2 లకు 63 మంది సప్లమెంటరీ విద్యార్థులు హాజరు కావలసి ఉండగా ఐదుగురు గైర్హాజరై నట్లు తెలిపారు. ఈనెల 31 వరకు సప్లమెంటరీ పరీక్షలు జరుగనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ పంబిరి మహదేవుడు కోటిలింగాల సత్రం
కోటిలింగాలపేట, రాజమహేంద్రవరం, తూ.గో.జిల్లా
ఫోన్ నెం.: 0883-2476959, సెల్ : 9491000718

స్మార్త, వేద పాఠశాలలో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ

పవిత్ర గోదావరి తీరాన రాజమహేంద్రవరం, కోటిలింగాలపేటలో గల శ్రీ పంబిరి మహదేవుడు కోటిలింగాల సత్రం నందు స్మార్త పాఠశాలలో 6 సంవత్సరముల కృష్ణ యజుర్వేద స్మార్త విద్య కోర్సును అభ్యసించుటకు బ్రాహ్మణ బాలుర నుండి నూతనంగా దరఖాస్తులు కోరబడుచున్నవి.

అర్హతలు : బాలురు వయస్సు 7 సంవత్సరములు నుండి 12 సంవత్సరముల లోపు ఉండి, ఉపనయనం జరిగి వుండవలెను.

సౌకర్యములు : విద్యార్థులకు నెలకు 1కి రూ.2,000/- స్టైఫండ్ ఇవ్వబడును. ఆహ్లాదకర, ఆధ్యాత్మిక వాతావరణంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన ఇవ్వబడును మరియు భోజనం, వసతి, వస్త్ర, వైద్య సౌకర్యములు సత్రంవారు ఉచితంగా కల్పించెదరు.

ప్రవేశము కొరకు ఇంటర్వ్యూ తేదీ : ది.13.06.2024 గురువారం ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకూ జరిగే మౌఖిక ఇంటర్వ్యూనకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులతో హాజరు కాగలరు.

1. విద్యార్థి జనన ధృవీకరణ పత్ర (జిరాక్సు కాపీలు-3) (ఒరిజినల్ చూపవలెను)
2. దరఖాస్తు
3. విద్యార్థి మరియు తల్లిదండ్రుల/సంరక్షకుల ఆధార్ కార్డు జిరాక్సు-3 (ఒరిజినల్ చూపవలెను)
4. రేషన్ కార్డు జిరాక్సు కాపీలు-3
5. ఉపనయనం శుభలేఖ
6. ఉపనయనం జరిగిన ఫోటోలు-2
7. విద్యార్థి యొక్క 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు

మౌఖిక ఇంటర్వ్యూ నందు ఉత్తీర్ణులు అయినవారిని ఎంపిక చేయబడును. దరఖాస్తు కొరకు కార్యాలయ పనివేళలలో అనగా ది.10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకూ ది.27.05.2024 నుండి పొందవచ్చును.

ఇట్లు
వి.వి.పళ్ళంరాజు, బి.టెక్
సహాయ కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారి
దేవాదాయ ధర్మాదాయ శాఖ

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

-జగ్గంపేట ఎస్ఐ ఎస్ నాగార్జున రాజు

జగ్గంపేట, మేజర్ న్యూస్ : మండలంలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగిందని జగ్గంపేట ఎస్సై నాగార్జున రాజ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. సోషల్ మీడియాలో పార్టీలను, వ్యక్తులను ఆధారంగా చేసుకుని రెచ్చగొట్టే పోస్టులు పెట్టినవారిపైనా చర్యలు ఉంటాయన్నారు. అదేవిధంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెట్రోలు బంకుల్లో లూజు అమ్మకాలు (వాహనాల్లో కాకుండా టిన్నులు, బాటిల్స్ లో) నిషేధించడం జరిగిందన్నారు. ఆ నిబంధనను ఎవరైనా వ్యతిరేకిస్తే చర్యలు తప్పమన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు బాణాసంచా విక్రయాలపైన కూడా నియంత్రణ ఉందని.. బాణాసంచా అమ్మకందారులు నిబంధనలను పాటించకపోతే వారిపైన చర్యలు తప్పవని ఆయన అన్నారు.

మాజీ ఎంపీపీ లక్ష్మీకాంతం మృతి

పెదపూడి,మేజర్న్యూస్ : పెదపూడి మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షురాలు యార్లగడ్డ లక్ష్మీకాంతం(58) ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె నడుముకు సంబంధించిన శస్త్ర చికిత్స నిమిత్తం హైదరాబాద్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేసిన తర్వాత గుండె నొప్పి రావడంతో మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. 2001 నుండి 2005 సంవత్సరం కాలంలో లక్ష్మి కాంతం ఎంపీపీగా పనిచేశారు. మాజీ ఎంపీపీ మృతి పట్ల పలు రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మా ఆసరా డబ్బులు మాకు ఇప్పించండి మహాప్రభో

-కానూరు యూనియన్ బ్యాంకు వద్ద బాధిత మహిళల నిరసన

-డ్వాక్రా సంఘాల పనితీరుపై మహిళల ఆందోళన

పెరవలి, మేజర్ న్యూస్ : పెరవలి మండలం కానూరు గ్రామంలో డ్వాక్రా సంఘాల సిఏలు కానూరు యూనియన్ బ్యాంక్ సిబ్బందితో చేతులు కలిపి తమ ఆసరా సొమ్ములను కాజేసారని తమ సంఘాల్లో పెట్టిన తీర్మానాలు ఒకటైతే డ్వాక్రా సీఏలు ఆ తీర్మానం కాపీలు మార్ఫింగ్ చేసి వేరే విధంగా బ్యాంకులకు అధికారులకు అంద చేశారని దీనిలో భారీ ఎత్తున ముడుపులు చేతులు మారాయని కానూరు డ్వాక్రా సంఘాల సభ్యులు మహిళలు మే 24వ తేదీ శుక్రవారం కానూరు యూనియన్ బ్యాంకు బ్రాంచ్ వద్ద ఆందోళన చేపట్టారు బ్రాంచ్ మేనేజర్అందుబాటులో లేకపోవడంతో సబ్ మేనేజర్ మునేశ్వరరావు కు వినతి పత్రం అందజేయడానికి ప్రయత్నించగా తాను అంతా విన్నానని కానీ డ్వాక్రా సీఏలు తమకురాతపూర్వకంగా వినతిపత్రం ఇస్తే తాము ఎవరెవరి అకౌంట్లోకి అమౌంట్ వేసాము చెప్పగలమని ఆయన బాధిత మహిళలకు తెలియజేయగా వారు బ్రాంచ్ వద్ద ఆందోళన చేపట్టారు. కానూరులో ముఖ్యంగా పెరవలి మండలం లో డ్వాక్రా సంఘాల పనితీరు చాలా ఘోరంగా ఉందని చనిపోయిన వారి పేర్లు కూడా కొన్ని సంఘాల్లో కొనసాగుతున్నాయని చనిపోయిన వారికి కూడా ఎకౌంట్లో డబ్బులు వేయటం కావాల్సిన వారికి ఆసరా సొమ్ములు ఇవ్వడం దీనిపై అవగాహన లేని వారికి ఏమీ తెలియని వారి డబ్బులను కాజేయడం మండలంలో నిత్య కృత్యం అయిపోయిందని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ వద్ద మహిళల నిరసన విషయం తెలుసుకున్న పెరవలి మండలం కానూరు గ్రామానికి చెందిన న్యాయవాది తణుకు బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి బహుజన సమాజ్ పార్టీ నాయకుడు వెన్నపు సుధాకర్ విషయం తెలుసుకుని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ కి వెళ్లి సబ్ మేనేజర్ మునేశ్వరరావు కు డ్వాక్రా మహిళలచే వినతిపత్రం ఇప్పించారు దీనిపై సబ్ మేనేజర్ మునేశ్వరరావు మాట్లాడుతూ తాము డ్వాక్రా సి ఎ లను పిలిచి ఈ విషయాలు పై తగు విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. వివరాలలోకి వెళ్తే కానూరు గ్రామంలో అమూల్య గ్రూపుకు సంబంధించి నలుగురు సభ్యులకు ఇవ్వవలసిన అమౌంటు ఇవ్వకుండా వేరే వాళ్ల బ్యాంక్ ఎకౌంట్ కు ఆసరా సొమ్ము ట్రాన్స్ఫర్ చేశారని దీనిలో డ్వాక్రా సంఘాల సిఏలు మరియు బ్యాంకు సిబ్బంది కలిసి కుమ్మక్కై నిధులు దుర్వినియోగం చేశారని బాధిత మహిళలు ఆరోపిస్తున్నారు. దీనిపై బీఎస్పీ లీడర్ వెన్నపు సుధాకర్ మాట్లాడుతూ తమ గ్రామంలో కొన్ని గ్రూపులకు సంబంధించిన సభ్యులకు ఆసరా పథకంలో రావలసిన డబ్బులు ఇవ్వలేదని తన దృష్టికి తీసుకురాగా తాను ఆ గ్రూపు లీడర్ ని అడిగానని ఆమె నుండి సరైన సమాధానం రాకపోవడంతో ఏపీఎం నాగరాజు దృష్టికి ఈ విషయం తీసుకుని వెళ్లడానికి ప్రయత్నించానని అయితే ఆయన ఆడిట్ జరుగుతుంది తనకు కాళీ లేదు అని అందుబాటులోకి రాలేదని ఆరోపించారు శ్రీనిధి వాతావరణం రాసినందుకు ఒక్కొక్క దానికి ఇప్పటికే శ్రీనిధి లోన్లు డ్వాక్రా లోన్లు రాసినందుకు మనిషి ఒక్కంటికి 600 రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నారని రుణమాఫీ పావలా వడ్డీ డబ్బులు రావాలన్నా మనిషి ఒక్కఇంటికి 600 రూపాయలు వసూలు చేస్తున్నారని మినిట్స్ బుక్కులు రాసినందుకు డబ్బులు తీర్మానాలకు డబ్బులు వసూలు చేస్తున్నారని ఇవన్నీ మిగతా వారికి తెలియకుండా ఉండేందుకు బుక్స్ అన్నీ తమ వద్ద ఉంచుకుంటున్నారని దీనిపై అధికారులు స్పందించరా అని ప్రశ్నించారు. ఈ విషయంలో సిఏలు ఎవరి ఖాతాలో వెయ్యాలో చెప్పిన వారికే బ్యాంక్ సిబ్బంది కూడా సొమ్ములు జమ చేశారని ఆయన ఆరోపించారు పెరవలి మండల వ్యాప్తంగా ఇటువంటి సంఘటనలు కోకొల్లలు అని దీనిపై అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరవలి మండల వ్యాప్తంగా కొన్ని గ్రామాలలో శ్రీనిధి నిధులు గోల్మాల్ కావడం వాటిపై జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టడం జరిగిందని ఇప్పటివరకు ఆ నిధులను కూడా జమ చేయించలేకపోయారని ఆయన దుయ్యపట్టారు డ్వాక్రా సిఏ లు తరచూ డ్వాక్రా గ్రూపు మెంబర్లతో వేలిముద్రలు వేయించుకుంటూ గ్రూపు ఫోటోలు తీయటం వంటి కార్యక్రమాలు చేస్తున్నారని పూర్తిగా చదువులేని విషయపరిజ్ఞానం లేని మహిళలను మోసగించడానికి తప్ప ఇవి ఎందుకు అని కొద్ది మంది డ్వాక్రా మహిళలు తమ దృష్టికి ఈ విషయం తీసుకువచ్చారని ఏదైనా ప్రైవేటు ఏజెన్సీలకు ఈ సమాచారాన్ని అందిస్తున్నారనే సందేహం కలుగుతుందని సుధాకర్ అన్నారు. పై అధికారులు ఇప్పటికైనా ఈ విషయంపై దృష్టి సారించి తగు విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని మరింత మంది మోసపోకుండా కాపాడాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల సభ్యులు వెన్నాపు సుందర కుమారి రాజేశ్వరి అమ్మాజీ భావన నాగమణి బంగారమ్మ మామిడిపల్లి లక్ష్మీ బోల నాగమణి బత్తుల వెంకటరత్నం మురాళ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలో ఏం దాగుంది

రచన : - శ్రీనివాస్ సూర్య
(వర్ధమాన సినీ గేయ రచయిత,
ఉపాధ్యాయుడు)
సెల్ నెం : 8886171959,
అమలాపురం..

ఈవీఎంలో ఏం దాగుంది
రేపటి దేశ భవిష్యత్తు దాగుంది..
యువత గుండెల్లో దాగున్న ఆశ దాగుంది..ఈవీఎంలో ఏం దాగుంది..
దేశ ప్రజల బంగారు భవిత దాగుంది..
రేపటి ప్రజాస్వామ్య మనుగడ దాగుంది..
ఈవీఎంలోఏందాగుంది..రాజ్యాంగంమనకిచ్చినఓటుహక్కు దాగుంది
ఆ రాజ్యాంగం అందించిన ప్రజాస్వామ్య సిద్ధాంతం దాగుంది..
ఈవీఎంలో ఏం దాగుంది..రాజకీయ నాయకుల రంగు దాగుంది..
ఆ రంగు బయటపడితే తెల్లారే పొద్దు దాగుంది..
ఈవీఎంలోఏందాగుంది..ఓటుఓటుగట్లుదాటేఅందమైనఆట దాగుంది..
ఏ ఓటు ఎటుపోతుందోనన్న గుబులెంతో దాగుంది..
ఈవీఎంలో ఏం దాగుంది
రాజకీయ కండువాలు దారిమళ్ళే అవకాశం దాగుంది
నాయకుల మాటల్లో తేనేపూసిన కత్తి దాగుంది
ఈవీఎంలో ఏందాగుంది ..కుర్చీల వేట కోసం ఆరాటం దాగుంది..
పదవుల్ని తూకమేసే తక్కెడ దాగుంది..
ఈవీఎంలో ఏం దాగుంది..పచ్చ నోటు ఖర్చైన పెట్టుబడి దాగుంది..
ఏరులల్లే పారిన మందు కిక్కు దాగుంది..
ఈవీఎంలో ఏం దాగుంది..రేపటి చిన్నారుల భవితవ్యం దాగుంది..
యువత తలరాతను మార్చేటి శాసనం దాగుంది
ఈవీఎంలో ఏం దాగుంది..ఇంటింట వెలుగులిచ్చే దేశ అభివృద్ధి దాగుంది..ఆ ఫలాలను అందుకోవాలన్న ఓటర్ల సంకల్పం దాగుంది
ఈవీఎంలో ఏం దాగుంది
మైకుల్లో నాయకులు చేసినట్టి గారడీ దాగుంది..
జెండాలు మోసుకున్న కార్యకర్త కష్టం దాగుంది
ఈవీఎంలోఏందాగుంది..ఉత్కంఠనురేపుతున్నప్రజానాడి దాగుంది..
ఉవ్వెత్తున ఎగసి పడే ప్రజా జ్వాల దాగుంది..
మరి ఈవీఎంలో ఏం దాగుంది.
పౌరుడిగా ఉన్నావో ఆరోగ్యం దాగుంది .
పౌరుషానికెళ్ళావో మాయరోగమే దాగుంది.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

-యటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.రామారావు

కూనవరం,మేజర్న్యూస్ : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. కౌంటింగ్, ఫలితాల నేపథ్యంలో అల్లూరి సీతారామ రాజు జిల్లాఎస్పీతూహిన్సిన్హా,చింతూరు ఇన్చార్జి ఏఎస్పీ రంపచోడవరం ఓఎన్జీ కేవీ మహేశ్వర రెడ్డి, ఆదేశాలతో వి ఆర్ పురం కూనవరంపోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వివిధ రాజకీయ పార్టీ నాయకులతో శుక్రవారం వీఆర్ పురం కూనవరం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ఐలు కే నాగరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూనవరం కూనవరం స్టేషన్ హౌస్ లో రెండు మండలాల వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ డి రామారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్ని కల ఫలితాలరోజు గానీ అనంతరం గానీ రాజకీయ కక్షతో గానీ, అల్లర్లు ప్రేరేపించే విధంగా ఏదైనా అవాంఛనీయ సంఘటనలు సృష్టించిన, ఆందోళనకారులు హింసాత్మక చర్యలకు పాల్పడినా, చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని అన్నారు ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు గొడవలు ప్రేరేపించడానికిప్రయత్నిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకూ రెండు మండలాల పరిధిలో ఎటు వంటి ఘర్షణలు చోటు చేసుకోలేదని, ఇదే శాంతి యుత వాతావరణం లెక్కింపు రోజున ఉండే విధంగాఉండాలని అందుకుఅన్ని పార్టీల వారు సహకరించాలని సూచించారు. విజయోత్సవాలు విజయోత్సవాలు ఊరేగింపులు బాణాసంచా పేల్చడం వంటి వాటిపై నిషేధం ఉందని అందుకు అందరూ ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు రోజు ఏ గొడవలు లేకుండా పరస్పరం సహకరించాలని తెలిపారుఈ సమావేశంలో వి ఆర్ పురం కూనవరం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్సైలు కే నాగరాజు శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్ నిర్మల్ కుమార్ రవికుమార్ సిబ్బంది విఆర్ పురం కూనవరం రెండు మండలాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిపిఎం తెలుగుదేశం జనసేన బిజెపి తదితర పార్టీల నాయకులు, ముఖ్యులు పాల్గొన్నారు.

కాకినాడ నగరపాలం సంస్థ తీరుపై సర్వత్ర విమర్శలు

- **రెండు రోజుల నుంచి మంచినీటి సరఫరా నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజానీకం**
- **అది చాలదంటూ మంచినీటి సరఫరా మరో రెండు రోజులు నిలిపివేత పొడిగింపు**
- **నగరపాలక సంస్థ అధికారులు తీరుపై మండిపడుతున్న ప్రజలు**
- **స్పష్టంగా కనబడుతున్న నగరపాల సంస్థ నిర్లక్ష్య వైఖరి**

కాకినాడ,మేజర్న్యూస్: గడిచిన ఐదు రోజుల నుంచి వాతావరణ శాఖ తుఫాన్లపై హెచ్చరిస్తున్న ప్పటికీ హడావుడిగాపనులు ప్రారంభించడం, ఇప్పుడు తుఫాన్ కారణంగా మరో రెండు రోజుల నీటి సరఫరా రాదంటూ పత్రికా ప్రకటన విడుదల చేయడం చూస్తుంటే నగరపాల సంస్థ అధికారులు నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనబడుతుంది. కాకినాడ నగర పాలక సంస్థకు చెందిన ఒక కమిషనర్ స్థాయి అధికారి ఉద్యోగ సంఘ నాయకుడు పేరుతో గడిచిన ఐదు సంవత్సరాల నుంచికాకినాడలో విధులు నిర్వహించడం, కింద స్థాయి అధికారులు సిబ్బంది చేసిన తప్పిదాలను చూసి చూడలేనట్టు వదిలేయడంతోఇలాంటిసమస్యలు ఉత్పన్నవుతున్నాయని విమర్శలువ్యక్తమవుతున్నాయిఇకపోతే మున్సిపల్ కమిషనర్ మరియు జిల్లాకు చెందిన ఇతర ఉన్నత అధికారులు నివసించే ప్రాంతాలలో మంచినీటి సరఫరాకి ఎటువంటి ఆటంకం లేకపోవడంతోసమస్యపై సరిగ్గా పట్టించుకుంటలేదన్నట్టు సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు ఇతర ఉన్నతాధికారులు కలగజేసుకుని మంచినీటి సమస్యని త్వరితగతిన పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

గర్భిణీ స్త్రీలకు ఉచితంగా న్యూరల్ డిఫెక్ట్ & టిఫా స్కానింగ్ పరీక్షలు..

-డిఎంహెచ్వో డా.వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు రిఫర్ చేసినగర్భిణీ స్త్రీలురాజమహేంద్రవరంరాయల్,జిఎస్ఎల్ ఆసుపత్రులలో ఉచితంగా న్యూరల్డిఫెక్ట్, టిఫాస్కానింగ్చేయించుకోవచ్చునని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో పిహెచ్సి వైద్యులు ప్రోగ్రాం అధికారులతో గర్భిణీ మహిళలకు వైద్య సేవలు, స్కానింగ్అంశంపైడీఎంహెచ్వోడా. వెంకటేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు రిఫర్ చేసిన గర్భిణీలను గర్భిణీ స్త్రీలకు రాయల్, జిఎస్ఎల్ ఆసుపత్రులలో ఉచిత స్కానింగ్ చేయించుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. నవజాత శిశువుల ఆరోగ్యం స్థితికి సంబంధించి ఆరోగ్యాన్ని నిర్ధారించడానికి నాణ్యతను చూడడానికి ప్రసవం అనంతరం సంరక్షణము కొరకు అల్ట్రా సోనోగ్రఫీ స్కానింగ్ ద్వారా తెలుసుకొని సరైన వైద్యం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.పుట్టుకతో వచ్చే వైకల్యాలు బహుళ గర్భాలు పేషంట్లకు గర్భధారణ కాలాన్ని నిర్ధారించడంలో ఈ స్కానింగ్లు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటాయని తెలియజేశారు. పుట్టుకతో వచ్చే వైకల్యాల నిర్ధారణ, ముందస్తు సమాచారాన్ని అందిస్తుందన్నారు. గర్భధారణ సమయంలో పుట్టినప్పుడు తగిన చికిత్స చేయడం మరియు నవజాత శిశువు సంరక్షణలో ప్రత్యేక స్కాన్ల ద్వారా తక్షణమే రిఫర్ చేయడానికి కోసం నిర్ణయాలు తీసుకోవడంలో ఎంతగానో సహాయపడుతుందన్నారు.

అదేవిధంగా ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ మల్టిపుల్ జస్టేషన్ మరియు ప్లేసెంటా ప్రీవియ వంటి కొన్ని పరిస్థితులు ప్రాణాంతకమైన సమస్యలకు దారి తీయవచ్చునని, వీటిని ముందుగానే గుర్తించి ఈ స్కేన్ల సహాయంతో తగిన విధంగా వాటిని నియంత్రించవచ్చని తెలియజేశారు. ప్రీ నేటల్ కేర్ లో ముఖ్యంగా 12 వారాలు దాటిన తర్వాత %చీ.ం% స్కాన్ ద్వారా న్యూరల్ డిఫెక్ట్స్ ను కనుగొనవచ్చునని, 18 నుంచి 22 వారాల వరకు టిఫాస్కాన్ చేయించుకోవాలని వీటిని ఉచితంగా రాయల్ హాస్పిటల్ నందు మరియు జిఎస్ఎల్ మెడికల్ కాలేజీ నందు ఈ స్కాన్ల్ ఆరోగ్యశ్రీ లాగిన్ ద్వారా రిఫరల్ స్లిప్ తీసుకుని మెడికల్ ఆఫీసర్ ద్వారా ఉచిత స్కానింగ్ లను తీయడం జరుగుతుందని తెలియజేశారు. వీటి ద్వారా పిండం యొక్క అసాధారణ పరిస్థితిలను గుర్తించడానికి వీలవుతుందని తెలియజేశారు. పుట్టుకతో వచ్చే లోపాన్ని పిల్లల సంఖ్య భారతదేశంలో అత్యధికంగా ఉంటుందని దాదాపు 33 మంది శిశువులలో ఒకరికి ఇటువంటి లోపాలు ఉండొచ్చని ప్రతి సంవత్సరం మన దేశ జనాభాలో 3.2 మిలియన్ల మంది లోపాల సంబంధిత వైఖల్యాలకు కారణం అవుతుందని,భారతదేశంలో హైరిస్క్ గర్భాల ప్రభాల్యం దాదాపు 15% ఉండగా డెలివరీ కి ముందు స్కాన్ లు చేయించుకునే వారు నాలుగు శాతం మాత్రమే ఉంటున్నారని తెలియజేశారు.

ప్రసూతి మరియు పెరినటల్ మరణాలను తగ్గించడం కోసం సాధారణ స్కానింగ్ లను విధిగా రెండుసార్లు చేయించుకోవాలని వీటి ద్వారా పిండం యొక్క పెరుగుదలను తెలుసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

ఈ స్కానింగ్ లను ఆరోగ్యశ్రీ ద్వారా ఎంపెనల్ అయినటువంటి ఆసుపత్రులలో గర్భిణీలకు ఉచిత టీఫా స్కాన్ అందించబడుతుందని ఈ సదుపాయాన్ని చాలా తక్కువగా ప్రజలు వినియోగించుకుంటున్నారని తెలియజేశారు. ప్రోగ్రాం ఆఫీసర్లు అందరూ పిహెచ్ వైద్యాధికారులకు తెలియజేయాలని చెప్పారు. వైద్యాధికారులు తమ ఆరోగ్యశ్రీ పోర్టల్ ద్వారా గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేయించాలని చేసే విధంగా తోడ్పడాలని దీనిపై పూర్తి స్థాయిలో సమీక్ష కూడా జరిగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేసషన్ ఆఫీసర్ డాక్టర్ రాజకుమారి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ మౌనిక, నిశాంత్ మరియు డిప్యూటీ డెమో సత్యకుమార్ నల్లూరి, జిల్లా గణాంక అధికారి కుమారస్వామి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణ వైభోగమే..

కన్నుల పండువుగా వెంకటేశ్వరుని కళ్యాణం

పెదపూడి, మేజర్న్యూస్ : పంచభూతాల సాక్షిగా ఆకాశమంత పందిరిలో భూదేవంత పీటపై వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభ వంగా జరిగింది.పెదపూడి మండలం గొల్లలమామిడాడ సూర్యనారాయణ పురంలో గుమ్మడికాయలో వెలసిన శ్రీ అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం కనులపండువగా జరిగింది. తెల్లవారు ఝామున తీర్థపు బిందెతో స్వామి ఆలయ ప్రవేశం చేసిన తర్వాత మేలుకొలుపు సేవతో మొదలై సప్తనదీజలాభిషేకము, పంచామృతాభిషేకము, నిత్యార్చన, మంగళశాసనము (హరతి), అనంతరం భక్తులకు స్వామి అమ్మవార్ల ధర్శనం లభిచింది . గ్రామంలో గల పవిత్ర తుల్యనదిలో స్నానం అచరించి భక్తులు ముడుపులు, మ్రొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉదయం 8గంటలకు ధ్వజారోహణం, విశేష హెూమాలు, ఐశ్వర్యసిద్ధికి, మోక్షసిద్ధికి, సకల కార్య సిద్ధికి ప్రత్యేక పూజలు జరిపించబడ్డాయి. రాత్రి 7 గంటలకు స్వామి వారిని కళ్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. ఆలయ దర్శకర్తల ఇంటి నుండి మంచి ముత్యాల తలంబ్రాలు, 9 రకాల పండ్లు ఊరేగింపుగా కళ్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. మధ్యాహ్నం. 8 గంటలకు సంకల్పం ప్రారంభమైనది. ఆనంతరం 8.45కు జీలకర్ర బెల్లం శిరస్సున ధరింపజేశారు.రాత్రి10గంటలకు బ్యాండుమేళాలు, నృత్యగీతాది మంగళవాయిద్యాలు, కోలాటములు, తీన్మార్ వాయిద్యములు, బారీ బాణాసంచాకాల్పుల నడుమ శ్రీ అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడింది. ఈ కళ్యాణ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా కొవ్వూరి అప్పారెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆరవిల్లి రఘురామాచార్యులు మాట్లాడుతూ స్వామిని దర్శించుకుని కోరిన కోరికలు సంవత్సరం లోపునే నెరవేరిన నిదర్శనాలు కొకొల్లలుగా ఉన్నాయని రోజురోజుకి స్వామి మహిమలు తెలుసుకుంటున్న భక్తులు దేశ, విదేశాల నుండి వచ్చి ఇక్కడ మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని తెలిపారు. కళ్యాణ తలంబ్రాలను శిరస్సున ధరించిన వారికి కొద్దికాలంలోనే కళ్యాణం జరుగుతుందని, సంతానంలేని వారికి తలంబ్రాల బియ్యాన్ని క్షీరాణ్ణంగా (పరమాణం) వండుకుని తిన్న వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం అని ఆయన వివరించారు. అనంతరం కళ్యాణాన్ని తిలకించిన భక్తులకు తలంబ్రాలను ఆలయ కమిటీ అందజేశారు. కళ్యాణాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను భోజన, వసతి సౌకర్యలను ఏర్పాటు చేసారు. స్వామి వారికి డిఆర్కె రెడ్డి, కాకినాడ ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు బొండా సూర్యరావు కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించారు. మల్లిడి శ్రీనివాస్ రెడ్డి, మల్లి వెంకట బొజ్జియ్య రెడ్డి, కొవ్వూరి అప్పారెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్ రెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి ఈ ఉత్సవాలలో అధికసంఖ్యలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారుకళ్యాణంలో ప్రత్యేక ఆకర్షణ..గొల్లలమామిడాడలో నిర్వహించిన శ్రీఅలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలలో గ్రామానికి చెందిన ద్వారంపూడి యువరాజారెడ్డి ప్రత్యేకంగా అలంకరించిన కొబ్బరిబొండాలుప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కౌంటింగ్పై సమావేశం

- **ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగానికి సహకారం అందించాలి**
- **లా అండ్ ఆర్డర్కు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతోంది**
- **కౌంటింగ్ ఏజెంట్స్ సమాచారం ముందస్థుగా అందజేయాలి**
- **పాస్ ఉండి, ఆధారటి లేఖలు ఉన్నా వారినే అనుమతించడం జరుగుతుంది**
- **నన్నయ్య యూనివర్సిటీ ఆవరణలోకి వాహనాలు అనుమతి లేదు**
- **కౌంటింగ్ ఏజెంట్స్ కొరకు దివాన్ చెరువు తదితర ప్రాంతాల్లో షటిల్ బస్సులు ఏర్పాటు చేస్తున్నాం**
- **ఎన్నికల ప్రవర్తనా నియమావళి జూన్ 6 వరకు అమలులో**
- **ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు, వారి మద్దతు దారుల ద్వారా బాణసంచా వినియోగం, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు**
- **కౌంటింగ్ సందర్భంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలి**
- **కౌంటింగ్ కోసం ఒక పార్లమెంటు ఏడు అసెంబ్లి నియోజకవర్గ హాల్స్లలో 129 టేబుల్స్ ఏర్పాటు**
- **జిల్లా ఎన్నికల అధికారి డా కే. మాధవీలత**

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ఓట్ల లెక్కింపు సందర్భంలో కౌంటింగ్ కేంద్రాలలో ఎన్నికలనియమావళికి విరుద్ధంగా ప్రవర్తించినా, ఉల్లంఘనలకుపాల్పడినాఅటువంటివారిపై బైండోవర్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని,ఈ విషయాన్ని చివరి వ్యక్తి వరకూ వెళ్లేలా అభ్యర్థులు, రాజకీయ పార్టీలు చర్యలు తీసుకోవాలని కలక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా కె. మాధవీలత తెలియ చేశారు. శుక్రవారం ఉదయం కలక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల, అభ్యర్థుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్, ఏసిపి.అనీల్ కుమార్, పార్లమెంటు నియోజక వర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఆర్ కృష్ణ నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం. భాను ప్రకాష్, అభ్యర్థులు, ఏజెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో 5కాసుల బంగారం చోరి

కామవరపుకోట,మేజర్న్యూస్: కామవరపుకోట మండలంలోని ఆడమిల్లి శివారు చిన్నమ్మారావుపాలెంలో ఓ వృద్ధురాలి మెడలో నుంచి 5 కాసుల బంగారాన్ని ఇద్దరు దొంగలు అపహరించారు. శుక్రవారం మధ్యాహ్నం తులసమ్మ తన ఇంటి ముందు కూర్చొని ఉండగా ఇద్దరు యువకులు వచ్చి మంచినీళ్లు కావాలని అడిగారు. ఆమె లోపలకు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా ఒకడు ఆమె మెడలో నుంచి బంగారం గొలుసు లాగేశాడు. అనంతరం ఆ దొంగలిద్దరు ఆడమిల్లి మీదుగా కామవరపుకోట వైపు వెళ్లిపోయారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తులసమ్మ ఆ దొంగను ప్రతిఘటించేందుకు విఫల ప్రయత్నం చే